ప్రజాశక్తి
ఆదివారం 20 ఏప్రిల్ 2025 5
అనంతపురం





ఎలక్ట్రానిక్ వస్తువులను పడేస్తున్న కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యే



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల, ముస్లిం నాయకులు

ముస్లిం, మైనార్టీల హక్కులను కాలరాసే కుట్ర

- వక్ఫ్ సవరణ చట్టం సరికాదు
- బిజెపి తీరుపై పార్టీలు, ప్రజాసంఘాల ఆగ్రహం
- గుంతకల్లులో ముస్లిం జెఎసి ఆధ్వర్యంలో ర్యాలీ

ప్రజాశక్తి-గుంతకల్లు

ముస్లిం, మైనార్టీల హక్కులను కాలరాసేలా బిజెపి నిరంకుశంగా చట్టాలను చేస్తోందని పలు పార్టీలు, ప్రజాసంఘాలు, ముస్లిం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. వక్ఫ్ చట్టం సవరణ బిల్లుకు వ్యతిరేకంగా శనివారం ముస్లిం, మైనార్టీల జేఏసీ ఆధ్వర్యంలో పట్టణంలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ర్యాలీకి సిపిఎం, సిపిఐ, వైసిపి, కాంగ్రెస్‌తో పాటు ఎమ్మార్పీఎస్ ఇతర ప్రజా సంఘాలు మద్దతు తెలిపి పాల్గొన్నాయి. మోదినాబాదులోని ఈద్గా మసీదు నుంచి ప్రారంభం అయిన ర్యాలీ ఆర్అండ్‌బి బంగ్లా, ధర్మవరం రైల్వే గేటు, మహాత్మా గాంధీ రోడ్డు మీదుగా పొట్టి శ్రీరాములు కూడలి వరకు జరిగింది. పొట్టి శ్రీరాములు కూడలిలో బహిరంగ సభను ఏర్పాటు చేశారు. ఈ సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వి.రాంభూపాల్, సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు డి.జగదీష్, మాజీ ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గం కన్వీనర్ డి.ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముస్లిం, మైనార్టీల మనుగడకు ముప్పు వాటిల్లే విధంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వక్ఫ్ చట్టాన్ని సవరణ చేసిందన్నారు. వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేసేవరకు ముస్లిం, మైనార్టీలు చేసే అన్ని ఆందోళనలకూ తమ సంపూర్ణ మద్దతు ఇస్తామని అన్నారు. మోదినాబాద్ దర్గా వద్ద వక్ఫ్ చట్టం సవరణ బిల్లుపై ప్రజాశక్తి దినపత్రిక ప్రచురించిన ప్రత్యేక సంచికను నాయకులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ భవాని, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బి.శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతీ ప్రసాద్, సిపిఐ నియోజకవర్గం కార్యదర్శి వీరభద్ర స్వామి, మున్సిపల్ వైస్ ఛైర్మన్లు మైమూన్, నైరుతీ రెడ్డి, మైనారిటీ నాయకులు నూర్ నిజామి, మహబూబ్ బాషా, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు స్వామిదాస్, ముస్లిం జేఏసీ కమిటీ అధ్యక్షుడు సద్దాం తదితరులు పాల్గొన్నారు.

మడకశిరలో మల్టీమోడ్ హ్యాండ్ గ్రానైడ్ పరిశ్రమ

- వెయ్యి ఎకరాలు కేటాయింపునకు ప్రభుత్వం అంగీకారం
- మొదటి దశలో 329 ఎకరాలు కేటాయింపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి



మడకశిర పరిధిలో మల్టీమోడ్ హ్యాండ్ గ్రానైడ్ తయారీ పరిశ్రమ ఏర్పాటుకు ఒక సంస్థకు ముందుకొచ్చింది. ఈ మేరకు ఆ సంస్థకు రెండు దశల్లో కలిపి వెయ్యి ఎకరాల భూమిని కేటాయించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. మొదటి దశ కింద 329 ఎకరాల కేటాయిస్తూ ఉత్తర్వులను శనివారం నాడు రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. దీంతో ఈ ప్రాంతంలో మందుగుండు తయారీ పరిశ్రమ ఈ ప్రాంతానికి రానుంది. యుద్ధాల సమయంలో డిఫెన్సీయు, అఫెన్సీయు రెండు విధానాలుగానూ ఈ గ్రానైడ్‌ను వినియోగించడం జరుగుతుంది.

రెండు దశల్లో వెయ్యి ఎకరాల కేటాయింపు

మల్టీమోడ్ హ్యాండ్ గ్రానైడ్ పరిశ్రమను మడకశిర ప్రాంతంలో ఏర్పాటు చేయనున్నారు. మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్ వైడ్ అనే సంస్థ ముందుకొచ్చింది. ఈ సంస్థ రూ.1197 కోట్ల వ్యయంతో మల్టీమోడ్ హ్యాండ్ గ్రానైడ్ ఉత్పత్తి పరిశ్రమను రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిఆర్‌డిఒ మల్టీమోడ్ హ్యాండ్ గ్రానైడ్‌ను డిఆర్‌డిఒ సంస్థ ఇది వరకు అభివృద్ధి చేసి ఉంది. దీని ఉత్పత్తి కోసమని మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్ వైడ్ అనే సంస్థ ముందుకొచ్చింది. రెండు దశల్లో ఏర్పాటు చేయనున్నట్టు ప్రభుత్వమిచ్చిన ఉత్తర్వుల్లో పేర్కొంది. మొదటి దశ కింద 329 ఎకరాలు కేటాయించారు. ఈ దశ పూర్తయితే ఈ ప్రాంతంలో 570 మందికి ఉపాధి లభిస్తుందని చెబుతున్నారు. అదే రకంగా రెండో దశ కింద 671 ఎకరాలను రాబోయే రోజుల్లో కేటాయించనున్నట్టు ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొనడం జరిగింది. దీని ద్వారా 300 మందికి ఉపాధి లభిస్తుందని ప్రకటించారు. మొత్తం 879 మందికి ఉపాధి లభించనుంది.

మీడియా రంగం నుంచి మందుగుండు సామగ్రి వైపు

మీడియా మ్యాట్రిక్స్ వరల్డ్‌వైడ్ అనే సంస్థ ఇప్పటి వరకు డిజిటల్ మీడియా రంగంలోనూ, హ్యాండ్‌సెట్ టెలికం రంగంలోనూ ఉంటూ వచ్చింది. ఈ సంస్థ ఇప్పుడు మందుగుండు తయారీ రంగంలోకి ప్రవేశిస్తున్నట్టు దీని ద్వారా స్పష్టమవుతోంది. ఈ రంగంలో ఈ సంస్థ ఏ మేరకు అనుభవముందన్నది సర్వత్రా చర్చ నడుస్తోంది. ఏది ఏమైనా వెనుకబడిన మడకశిర ప్రాంతానికి ఒక పరిశ్రమ రానుంది.

ఈ-వేస్ట్ సేకరణపై అవగాహన అవసరం

- స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్‌లో ముందుండాలి
- అందరి సహకారంతో స్వచ్ఛ అనంత సాధ్యం
- ఈ-వేస్ట్ కలెక్షన్ సెంటర్ ప్రారంభంలో ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

ఈ-వేస్ట్ సేకరణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అధికారులు ప్రజాప్రతినిధులు తెలియజేశారు. స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ముందు వరుసలో నిలుద్దామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ పిలుపునిచ్చారు. ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలో అవగాహన ర్యాలీని చేపట్టారు. ర్యాలీలో ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహం వద్ద మానవహారంగా ఏర్పాటు చేసి స్వచ్ఛ ఆంధ్ర – స్వచ్ఛ దివాస్ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఈవేస్ట్ సేకరణ కేంద్రాన్ని ప్రారంభించి, మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇటీవల ఎలక్ట్రానిక్ వస్తువుల వాడకం బాగా పెరిగిందన్నారు. మరమ్మతులకు వచ్చిన వాటిని వథాగా పడేస్తున్నారని, ఇలాంటి వస్తువుల్ని సేకరించి వాటిలో విలువైన పరికరాల్ని మళ్లీ ఉపయోగించేలా ఈ-వేస్ట్ సేకరణ కార్యక్రమాన్ని తీసుకొచ్చినట్టు తెలిపారు. దీనిపై ఎస్ఎస్‌జిలు, సచివాలయ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఫిబ్రవరి నెలలో 2వ స్థానంలో, మార్చి నెలలో 7వ స్థానంలో నిలిచామన్నారు. వచ్చే నెలలో మొదటి స్థానంలో ఉండేలా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ప్రతి మండల కేంద్రంలో 10 వేల జనాభా ఉన్న పంచాయతీ కేంద్రాల్లో ఈ వేస్ట్ సేకరణ కేంద్రాలను ప్రారంభిస్తామన్నారు. రానున్న రోజుల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల విక్రయాలు చేసే దుకాణాలు, మరమ్మతు కేంద్రాల నుంచి ఈ వేస్ట్ సేకరిస్తామన్నారు. వీటిన్నింటినీ హిందూపురం ప్రాంతంలోని ఒక కంపెనీకి తరలిస్తున్నట్టు చెప్పారు. ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు మరోసారి వినూత్నంగా ఆలోచించి ఈ వేస్ట్ సేకరణ చేపట్టారన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన అవసరమన్నారు. ప్రజల సహకారం ఉంటేనే స్వచ్ఛ అనంతను మనం చూడగలుగుతామని పేర్కొన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మాట్లాడుతూ ఈ వేస్ట్ సేకరించాలన్న ఆలోచన గతంలో ఎవరికి రాలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో వినూత్నంగా ఆలోచించి 75 ఏళ్లలో కూడా 25 ఏళ్ల యువకుడిలా ఆలోచిస్తున్నారని కితాబు ఇచ్చారు. రీసైకిల్, రీ ప్రాసెస్, రీ యూజ్ విధానాన్ని ఆయన చేపడుతున్నారన్నారు. స్వచ్ఛ అనంతకు మున్సిపల్ సిబ్బంది మాత్రమే శ్రమిస్తే సరిపోదని ప్రజల భాగస్వామ్యం కూడా అవసరం అన్నారు. నగరంలో త్వరలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, వంకలకు ప్రొటెక్షన్ వాల్స్‌ను నిర్మిస్తామన్నారు. అక్టోబర్ 2 నాటికి డంపింగ్ యార్డ్ లో చెత్త లేకుండా చేస్తామని చెప్పారు. డంపింగ్ యార్డ్‌ను మరోచోటికి తరలించేందుకూ చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నగరపాలక సంస్థ మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య, మున్సిపల్ రీజినల్ డైరెక్టర్ విశ్వనాథం, కమిషనర్ బాలరాజు, సూపరింటెండెంట్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిపిఒ నాగరాజు నాయుడు, జెడ్పీ సిఇఒ రామచంద్రారెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

నేడు 'శ్రమ కావ్యం' పుస్తక గానసభ

సినీ గేయ రచయిత సుద్దాల అశోక్ తేజ రాక

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జాతీయ అవార్డుల సినీ గేయ రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ రచించిన "శ్రమ కావ్యం" పుస్తక గాన సభ ఆదివారం సాయంత్రం 5.30 గంటలకు అనంతపురం జెడ్పీ హాలులో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన వివరాలను శనివారం నాడు సిఐటియు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఐద్వా రాష్ట్ర నాయకురాలు సావిత్రి, సిఐటియు నాయకులు ఆర్‌వి.నాయుడు, యుటిఎఫ్ నాయకులు రమణయ్య తెలియజేశారు. సిఐటియు, ఐద్వా, ఎస్ఎఫ్ఐ, జెవివి, యుటిఎఫ్ సంఘాలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సభకు ముఖ్య అతిథిగా సుద్దాల అశోక్ తేజ హాజరు అవుతారన్నారు. సమాజ అభివృద్ధిలో శ్రమ మార్పు, ఆధునిక కాలంలో దాని గొప్పదనం, అసమానతలతో కూడిన నేటి సమాజం ఎలా మారుతుందో 'శ్రమ కావ్యం'లో అశోక్ తేజ అద్భుతంగా వివరించారని చెప్పారు. శనివారం సాయంత్రం 5 గంటలకు జిల్లా పరిషత్ హాలులో జరిగే ఈ కార్యక్రమంలో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు తిరుపాలు, వీరరాజు, సాహితీ స్రవంతి బాల రంగయ్య, ఎస్ఎఫ్ఐ పరమేష్, భీమేష్, ఐద్వా చంద్రిక పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న దేవన్న

సంబరంగా జెఎన్‌టియు కళాశాల వార్షికోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జెఎన్‌టియు ఇంజినీరింగ్ కళాశాల వార్షికోత్సవం, స్పోర్ట్స్ డే 2025 సంబరాలు ఎన్‌టిఆర్ ఆడిటోరియంలో శనివారం ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జెఎన్‌టియు ఉపకులపతి ఓఎస్‌డి ఎన్.దేవన్న ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విద్యార్థులు వారికి నచ్చిన రంగంలో నైపుణ్యం సాధించి ముందుకు సాగాలన్నారు. ప్రిన్సిపాల్ పి.చెన్నారెడ్డి మాట్లాడుతూ కళాశాలలో చదువుకున్న ఎంతో మంది ఉన్నత స్థాయిలో ఉన్నారన్నారు. సరైన ప్రణాళికతో విద్యార్థులు ముందుకెళ్తే జీవితంలో విజయం సాధిస్తారని చెప్పారు. అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన వారికీ బహుమతులు, మెరిట్ సర్టిఫికెట్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ డైరెక్టర్లు నాగప్రసాద్ నాయుడు, సురేష్ బాబు, దుర్గాప్రసాద్, సత్యనారాయణ, సుజాత, పరీక్షలు విభాగం సిఈ ఏపీ.శివకుమార్, వైస్ ప్రిన్సిపాల్ ఎస్.వసుంధర, కళాశాల వివిధ విభాగాల ఆధిపతులు పాల్గొన్నారు.

కొళాయి కనెక్షన్ ఇప్పించండి సారూ..

కలెక్టర్‌ను వేడుకున్న మహిళ

అనంతపురం కార్పొరేషన్ : 'సారూ.. కొళాయి కనెక్షన్ కోసం నెలరోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా.. పట్టించుకునే వారే లేరు.. మీరైనా నాకు కొళాయి కనెక్షన్ ఇవ్వండి సారూ..' అంటూ ఓ మహిళ కలెక్టర్‌ను వేడుకుంది. శనివారం స్థానిక మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన 'ఈ వేస్ట్' ప్రారంభోత్సవం అనంతరం వేదిక దిగుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఓ మహిళ కలిసి తన ఆవేదనను వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా బాధిత మహిళ లక్ష్మీదేవి మాట్లాడుతూ నగరంలోని మారుతీనగర్ మొదటి క్రాస్‌లో ఉన్న తమ ఇంటికి కొళాయి కనెక్షన్ ఇప్పించాలని చాలా రోజుల నుంచి తిరుగుతున్నా పట్టించుకోలేదని వాపోయింది. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ తక్షణం ఆమెకు కొళాయి కనెక్షన్ వచ్చేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ బాలస్వామి, సూపరింటెండెంట్ ఇంజినీర్ చంద్రశేఖర్‌ను ఆదేశించారు.



మహిళ సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అకాల వర్షంతో రైతులకు నష్టం

- బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-ఉరవకొండ

ఇటీవల కురిసిన అకాల వర్షాలతో రైతులు పలు పంటలను నష్టపోయారని, వీరిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. విడపనకల్ మండల పరిధిలోని గడేకల్, హంచనహాళ్ గ్రామాల్లో శుక్రవారం నాడు అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల పంటలను సిపిఎం, రైతుసంఘం నాయకులు శనివారం పరిశీలించారు.



తడిసిన మిర్చిని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

సిపిఎం ప్రాంతీయ కార్యదర్శి రంగారెడ్డి, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు పెద్దముష్టూర్ వెంకటేశులుతో కలిసి పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా నల్లప్ప మాట్లాడుతూ శుక్రవారం కురిసిన అకాల వర్షాలతో ఉరవకొండ నియోజకవర్గంలో మిరపపంట రైతులు నష్టపోయారన్నారు. మిరప పంట తడిసి ముద్దవ్వడంతో రైతుల కష్టం ఆవిరైందన్నారు. తడిసిన మిరపను ఆరబెట్టేందుకు కుటుంబ సభ్యులంతా కష్టపడుతున్నా సాధ్యం కాని పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికే ధరలేక నష్టాలను చవిచూస్తున్న మిరప రైతులకు అకాల వర్షం మరింత కష్టాన్ని తెచ్చిపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. చేతికొచ్చిన పంట మొత్తం నాశనం అవడంతో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారన్నారు. బ్యాంకులు, ప్రయివేటు వ్యక్తుల వద్ద తెచ్చిన అప్పులను ఎలా తీర్చాలని రైతులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. తక్షణం వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి నష్టపోయిన పంట వివరాలను సేకరించి ప్రభుత్వానికి పంపాలన్నారు. వెంటనే నష్టపరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పంటలతో పాటు గడేకల్ గ్రామానికి చెందిన బోయ వెంకటేశులు చెందిన గాలి మిషన్ రేకుల షెడ్డు గాలీవానకు నేలకూలిందన్నారు. ఇలాంటి బాధితులనూ గుర్తించి వారికి పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు హంపయ్య, వరలక్ష్మి, పర్వతప్ప, భీమేష్ పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సిఎం చంద్రబాబు భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈమేరకు ఈనెల 25న అనంతపురంలోని కలెక్టరేట్ ఎదుట నిర్వహించనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను శనివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చే పది నెలలు గడుస్తున్నా హామీలు అమలుకు పూనుకోకపోవడం బాధాకరమన్నారు. ముఖ్యంగా బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డును తక్షణమే పునరుద్ధరించాలన్నారు. రాష్ట్రంలో గత వైసిపి ప్రభుత్వం కార్మికులకు అమలవుతున్న సంక్షేమ పథకాలను ఆపేస్తూ జీవో 12, 14ను జారీ చేసిందన్నారు. అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టిడిపి, జనసేన నాయకులు తాము అధికారంలోకి వస్తే ఆయా జీవోలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. అయితే అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదన్నారు. వెంటనే కార్మికుల సంక్షేమ బోర్డును అమలు చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి నాగేంద్ర, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు నెట్టికల్లు, భవన నిర్మాణ కార్మికులు రామకృష్ణ, వేణుగోపాల్, బాషా, చంద్ర, వన్నమ్మ, నెట్టికంటయ్య, లక్ష్మి, రాము, నర్సింహులు, రమేష్, టిలక్ష్మి, పద్మావతి, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్లు విడుదల



బుక్కరాయసముద్రంలో పోస్టర్లను పంపిణీ చేస్తున్న నాయకులు

ఉరవకొండ : భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి టి.రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఈనెల 25న కలెక్టరేట్ ఎదుట భవన నిర్మాణ కార్మికుల సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన ధర్నాకు సంబంధించిన కరపత్రాలను శనివారం కూడేరులో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కరీమ్, భవన నిర్మాణ కార్మికులు రాము, నర్సింహులు, రమేష్, టి.లక్ష్మి, పద్మావతి, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

రైతులకు అందుబాటులో ఉండాలి

జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం


మండల, డివిజన్ స్థాయి వ్యవసాయ అధికారులు రైతులకు క్షేత్రస్థాయిలో రైతులకు అందుబాటులో ఉండి సేవలు అందించాలని జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం సాయంత్రం నగరంలోని జెడిఎ కార్యాలయంలో ఉన్న సమావేశ హాలులో సహాయ వ్యవసాయ సంచాలకులు, మండల వ్యవసాయ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి ప్రభుత్వం యాంత్రీకరణ పథకం కింద జిల్లాకు కేటాయించిన రూ.3కోట్లకు ఇప్పటి వరకూ రూ.1.7 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. మిగిలిన మొత్తాన్ని ఈనెల 24వతేదీలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. 2024-25 సంవత్సరం సంబంధించి యాంత్రీకరణ పథకం ఈనెల 24వతేదీలోపు రైతు నుంచి అప్లికేషన్, రైతువాటాను చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ స్థాయి సహాయ వ్యవసాయ సంచాలకులు మీనలరవి, యల్లప్ప, పద్మజ, లక్ష్మానాయక్, వెంకటరాముడు, మండల వ్యవసాయ అధికారులు జె.శశికళ, సాంకేతిక వ్యవసాయ అధికారులు బాలనాయక్, వెంకటకుమార్, రాకేష్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-గుత్తి

రాష్ట్రంలోని రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ అన్నారు. శనివారం పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ప్రభుత్వం రాయితీ కింద మంజూరు చేసిన వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు రైతులు సద్వినియోగం చేసుకొని అధిక దిగుబడులు సాధించి ఆర్థికంగా నిలదొక్కుకోవాలన్నారు. అలాగే గుంతకల్లు నియోజకవర్గంలోని చెరువులన్నిటిని సాగునీటితో నింపుతామన్నారు. రూ.220 కోట్ల నిధులతో గుత్తి, పామిడిలో తాగునీటి ప్రాజెక్టు నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడిఎ ఎం.వెంకటరాముడు, వ్యవసాయాధికారులు ముస్తాక్‌అహ్మద్, లీనా వసుంధర, ఎంపిడిఒ ప్రభాకర్‌నాయక్, టిడిపి గుత్తి, పామిడి మండలాల ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్, టిడిపి పట్టణ, మండల అధ్యక్షులు ఎంకె.చౌదరి, బర్దివలి, నాయకులు ప్రభాకర్‌చౌదరి, కోనంకి కృష్ణ, దిల్కాశీనా, ఇసాక్, సొలమన్ రాజా, చికెన్ శీనా, జక్కలచెరువు ప్రతాప్, బి.రమేష్, బోయ వేణుగోపాల్, జి.సుంకన్న, పి.సుధాకర్, కెబి రామకృష్ణ, కొనకొండ్ల సూరి, న్యాయవాది సోము, జనసేన నాయకుడు పాటిల్ సురేష్, సర్పంచి యు.రామలింగమయ్య, ఎంపిటిసి ఎం.ధనుంజయ, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు పరికరాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జయరామ్

21న గుత్తిలో జాబ్‌మేళా

గుత్తి : పట్టణంలోని పిఆర్ఆర్ ఎంబిఎ కళాశాల, శ్రీసాయి డిగ్రీ కళాశాలల్లో ఈనెల 21న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు శ్రీసాయి క్యాంపస్ సిఇఒ ఎ.శ్రీరాములు, ప్రిన్సిపాల్ ఎం.ప్రసన్నకుమార్, సి.వెంకటేశ్వర్లురెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాదు, బెంగళూరుకు చెందిన కంపెనీలకు చెందిన ప్రతినిధులు హాజరై అభ్యర్థులను ఎంపిక చేసుకోనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వడ్డీ కట్టించుకుని రుణాలను రెన్యువల్ చేయాలి

రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.మల్లికార్జున

ప్రజాశక్తి-డి.హీరేహాల్

జిల్లాలో రైతులు బ్యాంకుల్లో బంగారాన్ని తాకట్టు పెట్టి తీసుకున్న రుణాలను వడ్డీ మాత్రమే కట్టించుకుని రెన్యూవల్ చేయాలని ఎపి రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎం.మల్లికార్జున డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం మండలంలో ఉన్న ఐదు బ్యాంకుల మేనేజర్లను కలిసి వినపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు బ్యాంకులతోపాటు వడ్డీ వ్యాపారుల వద్ద అప్పులు తీసుకొచ్చి పంటలు సాగు చేసి ప్రకృతి వైపరీత్యాల కారణంగా నష్టపోయారన్నారు. కావున రైతుల బంగారు, పంట రుణాలను వడ్డీ కట్టించుకుని రెన్యూవల్ చేయాలని, బ్యాంకు వద్ద నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని, బ్యాంకుల సర్క్యులర్లను తెలుగులో నోటీస్ బోర్డులో ఉంచాలని, రైతులందరికీ కిసాన్ క్రెడిట్ కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు మార్టిగేజ్ (తాకట్టు) లేకుండా రూ.5లక్షల వరకూ ఇవ్వాలని, డిమాండ్ చేశారు.



బ్యాంకు అధికారికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరిసరాలను శుభ్రంగా ఉంచుకుందాం


బుక్కరాయసముద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న అతిథులు

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం
తమ ఇళ్లతోపాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపిపి సునీత, ఎంపిడిఒ సోలమన్‌రాజ్ సూచించారు. 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'లో భాగంగా మండలంలోని జన చైతన్య నగర్ కాలనీలో ఈ-వెస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు), పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అన్నారు. అనంతరం 'స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ' చేయించారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డిఒ సదాశివ, పంచాయతీ కార్యదర్శి పెద్ద శ్రీనివాసులు, ఎపిఎం నారాయణస్వామి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నాగేంద్ర, మల్లెలేటి, కాలనీ నాయకులు బాబా ఫక్రుద్దీన్‌వలి, రంగయ్య, సురేష్, బాలు, మునీరా, దూదేకుల మహబూబ్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

యల్లనూరు : స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎంపిడిఒ వాసుదేవరెడ్డి, ఇఒఆర్‌డి మనోహర్ ఆధ్వర్యంలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొబైల్ షాప్‌లో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ వేయకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సలీంబాషా, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : ఈ-వ్యర్థాల సేకరణపై గుత్తిలో శనివారం మున్సిపల్ కమిషనర్ బి. జబ్బార్ మియా ఆధ్వర్యంలో ఇ-వ్యర్థాల సేకరణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్‌ఎస్ లో ఉన్న పూలే విగ్రహం నుంచి రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ కార్యక్రమంలో ఆర్డిఒ శ్రీనివాసులు,డిఎల్ డిఓ విజయలక్ష్మి, తహశీల్దార్ డి.ఓబిలేసు, సిఎస్‌డిటి కె.సూర్యనారాయణ, డిఇఇ హేమచంద్ర, మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ మహబూబ్‌బాషా, ఆర్‌ఓ కమలాకర్ సతీష్, సర్వేయర్ దినేష్‌రెడ్డి, టిపిబిఒ అప్పస్వామి, హెల్త్ అసిస్టెంట్ నెట్టికల్లు రవికిరణ్, నాగార్జున, సతీష్, ఎఇలు హరికిరణ్, రవికుమార్, మెప్మా సిఒలు చంద్రశేఖర్, సురేఖ, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎంకె.చౌదరి, తదితరులు పాల్గొన్నారు.



గుత్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

కుటుంబ సాధికార సారథులను నియమించండి

మండల కన్వీనర్ రుద్రమనాయుడు

ప్రజాశక్తి-యాడికి
మండలానికి కుటుంబ సాధికార సారథులను నియమించాలని టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో కుటుంబ సాధికార సర్వేపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతివార్డుకు కుటుంబ సాధికార సారథులను ఆయా వార్డు నాయకులు నియమించాలన్నారు. ఓటరు జాబితాలో ఉన్న ప్రతి 30 మందికీ ఒకరిని నియమిoచాలన్నారు. సాధికార సారథికి తప్పనిసరిగా తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు చేయించుకుని ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో టిఎన్‌టియుసి ఉపాధ్యక్షుడు పరిమి సోమశేఖర్‌నాయుడు, పట్టణ అధ్యక్షులు వెలిగండ్ల ఆదినారాయణ, నాయకులు రూపునేని రాజశేఖర్, నరసింహచౌదరి, తిరంపురం నీలకంఠ, తాండ్ర విక్రమ్, మధురాజు, బొట్టు శేఖర్, నీలకంఠారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ఆదినారాయణ, సూర్యనారాయణ, పాండు, కూనా వెంకటస్వామి, అల్లా పురుషోత్తం, పోలా రామాంజి, గడ్డం ప్రసాద్, డేవిడ్, హాజీ మస్తాన్, చాంద్‌బాషా, ఫిరోజ్, చందు, వెంకటేష్, సుభాన్, దాసరి చంద్ర, పూలతోట చంద్ర, భాష అరుణమ్మ, పామిశెట్టి గోపి, రవి, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోండి

ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి

ప్రజాశక్తి-శింగనమల
అంగన్వాడీ కేంద్రాల్లో అందించే పోషకాహారాన్ని గర్భిణులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ పి.ఉమాదేవి సూచించారు. శనివారం మండల పరిధిలోని శివపురం అంగన్వాడీ కేంద్రంలో పోషణ ఆహార ప క్షోత్సవాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పోషకాహారం ప్రాముఖ్యత, పెరుగుదల పర్యవేక్షణ, తల్లిపాల ప్రాముఖ్యత, ఆరోగ్య పరీక్షలు, రక్తహీనత, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ రమాదేవి, హెల్పర్లు రజిత, ఎఎన్‌ఎంలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

పామిడి : మండలంలోని తంబళ్లపల్లి గ్రామంలో శనివారం అంగన్వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఒ భారతి మాట్లాడుతూ పోషకాహార లోపం ఉన్న పిల్లలకు అధిక శక్తినిచ్చే ఆహార పదార్థాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్‌వైజర్, హెల్త్ విభాగం సూపర్‌వైజర్, తదితరులు పాల్గొన్నారు.


శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీలు

'పూలే' సినిమాను అడ్డుకుంటే పతనమే..

ఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు పోతుల నాగరాజు

ప్రజాశక్తి-అనంతపురం
దేశ తొలి సామాజిక విప్లవ పితామహులు, సంఘసంస్కర్త మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం ఆధారంగా నిర్మించిన సినిమాను అడ్డుకుంటే పతనం ప్రారంభమైనట్లే అని రిజర్వేషన్ల పరిరక్షణ సమితి (ఆర్‌పిఎస్) వ్యవస్థాపకులు, మహాత్మ పూలే ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ పోతుల నాగరాజు శనివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. మహనీయుల జీవితం ఆధునిక సమాజానికి తెలియాలంటే ఇప్పటి ప్రచార సాధనంలో ప్రధానమైంది సినిమానే అన్నారు. అయితే కేంద్రంలోన బిజెపి ప్రభుత్వం సినిమా విడుదలకు అనేక షరతులు పెట్టడం బాధాకరమన్నారు. మనువాద భావజాలంతో పని చేస్తున్న బిజెపికి సినిమా విడుదల ఆపే కుట్రలను మానుకోవాలని సూచించారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఇఒ

నార్పల : మండలంలోని ప్రభుత్వ పాఠశాలలను ప్రయివేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలని మండల విద్యాధికారులు కృష్ణయ్య, నారపరెడ్డి సూచించారు. శనివారం మండల కేంద్రంలోని విద్యాధికారి కార్యాలయంలో ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 23వ తేదీ నుంచి పాఠశాలలకు వేసవి సెలవులు ప్రారంభమవుతాయన్నారు. తిరిగి పాఠశాలలు ప్రారంభమయ్యేలోపు పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. అంతేగాకుండా విద్యార్థుల సంఖ్య పెంచాలన్నారు.

మొక్కలను నాటి సంరక్షించాలి


మొక్క నాటుతున్న అధికారులు

గుత్తి : మొక్కలను నాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మనాభయ పిళ్లై పిలుపునిచ్చారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ఎపిఎస్‌పిడిసిఎల్ డివిజన్ కార్యాలయంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎపిఎస్‌పిడిసిఎల్ డిఇ సాయిశంకర్, కమర్షియల్ డిఇ రామకృష్ణ, ఎఇ నాగేంద్రబాబు, జెఎఇలు చాంద్‌బాషా, విన్సెంట్ కుమార్, లైన్ ఇన్స్‌పెక్టర్లు కె.నాగేంద్రప్రసాద్, సూర్యనారాయణ, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు. అలాగే ప్రభుత్వ వైద్యశాలలో మెగా ఫ్యామిలీ అభిమానుల అసోసియేషన్ ఆధ్వర్యంలో మొక్కలను నాటారు. కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ యల్లప్ప, అఖిల భారత చిరంజీవి యువత జిల్లా అధ్యక్షుడు పాటిల్ సురేష్, రామ్ చరణ్, యువశక్తి జిల్లా ప్రధాన కార్యదర్శి బోయగడ్డ బ్రహ్మయ్య, నాయకులు వెంకటపతినాయుడు, మిద్దె ఓబులేసు, అఖండ బాషా, హరి, షేక్షావలి, ధను, వంశీ, నర్సులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎండలతో జాగ్రత్త... : డిఎంహెచ్‌ఒ

అనంతపురం : ఎండలు తీవ్రమవుతున్న నేపథ్యంలో ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్‌ఒ ఇబి దేవి సూచించారు. శనివారం నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డిఎంహెచ్‌ఒ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఎండ తీవ్రత అధికమవుతోందన్నారు. కావున సాధ్యమైనంత వరకూ చల్లని ప్రదేశాల్లో ఉండాలన్నారు. నీరు, మజ్జిగ ఎక్కువగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పరిపాలన అధికారి గిరిజ మనోహర్‌రావు, డిప్యూటీ డెమో త్యాగరాజు, కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌బాబు, విజయ భాస్కర్‌రెడ్డి, పవన్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ

జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో 'నారాయణ' సత్తా

భూపతినితిన్‌కు ఆలిండియా ఓపెన్ కేటగిరిలో 67వ ర్యాంకు

ప్రజాశక్తి-అనంతపురం
జెఇఇ మెయిన్స్ ఫలితాల్లో నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు అఖిల భారత స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చాటి చరిత్ర సృష్టించారు. కళాశాలకు చెందిన భూపతి నితిన్ అగ్నిహోత్రి 300 మార్కులకు 290 మార్కులతో 99.997 అత్యధిక పర్సంటైల్ సాధించి ఆలిండియా ఓపెన్ కేటగిరి 67వ ర్యాంకుతో జిల్లాలో మునుపెన్నడూ సాధించని పర్సంటైల్ సాధించి రాయలసీమ జిల్లాలలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అలాగే ఆలిండియా ఓపెన్ కేటగిరిలో మహమ్మద్ అసీఫ్ 8053 ర్యాంకు, భావన 8792, విశాల్ 9335, సవిత్‌కుమార్‌రావు 10473ర్యాంకుతో అత్యుత్తమ ప్రతిభ చాటారు. 99 పర్సంటైల్‌పైన ఐదుగురు విద్యార్థులు, 98 పైన ఏడు మంది విద్యార్థులు, 97పైన 12 మంది, 94పైన 18 మంది అఖిల భారత స్థాయిలో ఉత్తమ ప్రతిభను చాటారు. ప్రతిభను చాటిన విద్యార్థులు, తల్లిదండ్రులను, బోధన చేసిన సిబ్బందికి అనంతపురం కోర్ డీన్ బికె బద్రీనాథ్, డిజిఎం ఎస్.వెంకటరామిరెడ్డి, ప్రిన్సిపాల్ రవిశంకర్‌రెడ్డి, ఓబన్నగౌడ్, డీన్ శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాళ్లు శిఖామణి, శైలజ, హిమబిందు, శ్రీధర్‌బాబు, ఎజిఎంలు చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, కేశవరెడ్డి అభినందనలు తెలిపారు.



ర్యాంకర్‌ను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

నాన్నకు తోడుగా...
జాతీయ స్థాయి కళాశాలలో ఉత్తమ స్థాయిలో నిలవాలన్న ఆకాంక్షతో ముందుకెళ్తున్నా. కన్‌స్ట్రక్షన్ రంగంలో నాన్నకు తోడుగా మంచి సత్ఫలితాలతో ఎదగాలని ఆకాంక్ష.

మహిళలను పారిశ్రామికవేత్తలను చేయడమే లక్ష్యం

ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ

ప్రజాశక్తి-పుట్లూరు
మహిళలను పారిశ్రామిక వేత్తలను చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఐకెపి కార్యాలయంలో సెర్ప్, ఈజీ మార్ట్ సంయుక్తంగా నిర్వహించిన మహిళా వర్తకులకు ప్రోత్సహం అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో కిరాణా దుకాణాలు నిర్వహిస్తున్న, నిర్వహించాలనుకున్న మహిళా సంఘ సభ్యుల ఆర్థిక ఆదాయం పెంచేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, ఈజీ మార్ట్ వారు ఒప్పందం చేసుకున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఔత్సాహిక మహిళలు పారిశ్రామికవేత్తలుగా కావడానికి మంచి అవకాశమన్నారు. ఈ స్టోర్‌ల ద్వారా బ్రాండ్ ఐటమ్స్, మార్కెటింగ్ ధరల విధానం గురించి తెలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈశ్వరయ్య, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ గంగరాజు, తాడిపత్రి ఏరియా కో ఆర్డినేటర్ వీరాస్వామి, ఎంపిడిఒ అలివేలమ్మ, డిప్యూటీ తహశీల్దార్ మల్లేష్ ప్రసాద్, ఈజీ మార్ట్ నుంచి బోస్, ఎపిఎం వెంకటరామిరెడ్డి, మండల సమైక్య అధ్యక్షురాలు నల్లమ్మ, నాయకులు బాలరంగయ్య, సుదర్శన్‌నాయుడు, చవ్వా కులశేఖర్‌రెడ్డి, ఎల్కే చెన్నారెడ్డి, బ్రహ్మయ్య, గోవర్ధనరాజు, వేణు, నాగేశ్వర్‌రెడ్డి, శివారెడ్డి, వాసుదేవరెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

కుట్టుమిషన్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి
మహిళలు ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ కోరారు. మండలంలో ఇప్పటి వరకూ 84 మంది మహిళలు కుట్టు మిషన్ శిక్షణ కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఇంకా ఉత్సాహవంతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య కేంద్రం తనిఖీ
మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా ఆసుపత్రికి వచ్చిన ప్రజలతో వసతులపై ఆరాతీశారు. ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు శ్రీవాణి, విష్ణుమూర్తి, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం
అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అనంతపురంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో వైద్య సిబ్బంది, సెక్యూరిటీ గార్డులకు అగ్నిమాపక నివారణపై శనివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు గదుల్లో చిక్కుకున్న వారిని ఏవిధంగా రక్షించాలి, రక్షణ చర్యలు ఎలా చేపట్టాలనే విషయాలను జిల్లా సహాయ అగ్నిమాపక అధికారి కెపి లింగమయ్య వివరించారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు సంభవిస్తే ఫోన్ నెంబర్లు 101, 08554-220299, 99637 39592ను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ కెఎస్‌ఎస్ వెంకటేశ్వరరావు, ఆర్‌ఎంఒజి హేమలత, ఎల్‌ఎఫ్‌లు ఎస్.రమేష్‌కుమార్‌రెడ్డి, బి.వెంకటేసులు, కె.కృష్ణకుమార్, ఇ.ఈరేష్‌గౌడ్ డిఒపి, సిఎఫ్‌ఎంలు మధుసూదన్, వై.ఓబిరెడ్డి, ఎ.వంశీకృష్ణ, బి.వేణుగోపాల్, జి.తిప్పేస్వామి, కె.జయరాముడు, కె.అనిల్‌కుమార్, బి.సుధాకర్, ఎం.రమేష్, డి.శివతేజ హెచ్‌సి, సెక్యూరిటీ గార్డులు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం : అగ్ని ప్రమాదాలపై రాయదుర్గంలోని ప్రాంతీయ ప్రభుత్వ ఆసుపత్రిలో అగ్నిమాపక సిబ్బంది శనివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా గ్యాస్, ఆయిల్ ఆధారిత అగ్నిప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన అత్యవసర చర్యలు, స్పందన విధానాలు, ప్రాథమిక అగ్నిమాపక పద్ధతులపై ప్రయోగాత్మకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు మేరీ, మోహన్‌సాయి, మహేష్‌కుమార్, ఫైర్ ఆఫీసర్ నాగేశ్వరరావు, లీడింగ్ ఫైర్‌మెన్ మల్లారెడ్డి, యుగంధర్, రంజిత్, శివశంకర్, ధనుంజయ, హెడ్నర్స్, స్టాఫ్‌నర్సులు, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.


అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

రుణపాశాలు..!



ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి
రైతులు, చేనేత కార్మికులు, సామా న్య వ్యాపారులు ఇలా అన్ని తరగతుల వాళ్ల రుణభారాలు అధికమవుతున్నాయి. ఈ భారాల నుంచి బయటపడలేమన్న భయంతో ఆత్మహత్య లు పెరుగుతున్నాయి. ఈ వారంలో పెద్దఎత్తున రైతు ఆత్మహత్యలు చోటు చేసుకున్నాయి. పెట్టిన పంటలకు పెట్టుబడులు కూడా రాలేదని రుణ భారం రైతులు ఆత్మహత్యలు వరుసగా చోటు చేసుకున్నాయి. ప్రకృతి వైపరిత్యాలు కూడా వారిని దెబ్బతీశాయి. గాలివాన బీభత్సానికి పం టలు దెబ్బతిని అరటి రైతు యల్లనూరు మండలంలో ఆత్మహ త్యకు పాల్పడ్డారు. ఇంకోవైపు నార్పలలో మామిడి పంట కొనుగో లు చేసింది గాలివానకు దెబ్బతినడంతో వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మవరంలో చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా వరుసగా ఈ వారంలో పెద్దఎత్తున ఆత్మహత్యలకు పాల్పడ్డారు. రుణభారాలు పెరిగిపోతుండటంతో నే ఆత్మహత్యలు పెరుగుతున్నాయి. ఈ రుణభారాలు ఒక్క రైతులు, చేనేత కార్మికులకే కాకుండా మధ్యతరగతి ప్రజలకు కూడా వెంటాడుతున్నాయని ఇటీవల వెలువడిన నివేదికలు చెబుతున్నాయి. ఇక ఈ వారంలో వాతావరణంలోనూ అనూహ్యమైన మార్పులుంటున్నాయి. ఒకవైపు ఎండలు మండిపోతుండగా, మరోవైపు గాలివానలు వీడటం లేదు. వరుసగా వీస్తుండటంతో పంటలు దెబ్బతింటున్నాయి. అరటి, మామిడి పంటలతోపాటు, మొక్కజొన్న పంటలు తీవ్రంగా పంటలు దెబ్బతింటున్నాయి. ఈ వాతావరణం చూసి రైతుల్లో గుబులు నెలకొంది. ఇదే అదునుగా పంటలకు సరైన ధరను కల్పించకుండా తక్కువకనే కొనుగోలు చేస్తున్నారు. గాలివానకు పంటలు ఎప్పుడు పడిపోతాయోనని గుబులు రైతుల్లో నెలకొంది. దీంతో ఉన్న కాడికి అమ్ముకునేందుకు రైతులు పోటీపడుతుండ టంతో ధరను తగ్గించి వ్యాపారులు అమ్మేసుకుంటున్నారు. అరటి ధర టన్ను రూ.11 వేలు లోపే ఉంది. బత్తాయిన క్వింటాళు రూ.22 వేలు వరకే ధర ఉంటోంది. మామిడి ధరలు కూడా పడిపోతున్నాయి. ఇలా ప్రతి పంటకూ ధరలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గిట్టుబాటు ధర కల్పించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వారంలో మంత్రుల పర్యటనల సాగాయి. సత్యసాయి జిల్లాలో మడకశిర నియోజకవర్గంలో ఒకేసారి నలుగురు మంత్రులు పర్యటించారు. ఇక అనంతపురం జిల్లాలో ఇన్‌ఛార్జి మంత్రి టిజి.భరత్ పర్యటించారు. ఈ పర్యటన సం దర్భంగా శింగనమల నియోజకవర్గంకు సంబంధించి టిడిపి నేత ల మధ్య విభేదాలు వెలుగు చూశాయి. పరస్పరం ఘర్షణకు దిగారు. ఇక కూటమి నేతల మధ్య విభేదాలు కొనసాగుతు న్నాయి. సాధారణంగా సోదరుల మధ్యనున్న భేదాలేనని ఇన్‌ఛార్జి మంత్రి భరత్ చెప్పారు. అయితే ఇవి రాబోయే రోజుల్లో ఏ రకంగా సర్దుబాటు అవుతాయో చూడాల్సి ఉంది.

ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీపై అసత్య ఆరోపణలు బాధాకరం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్
శింగనమల నియోజకవర్గంలో నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీపై కొందరు చేస్తున్న అసత్య ఆరోపణలు మానుకోవాలని ఆ నియోజకవర్గ టిడిపి నేతలు పసుపుల శ్రీరామిరెడ్డి, దండు శ్రీనివాసులు, జిసి బాబు, అనిల్, మధు, సాయి, చిన్న ఆంజనేయులు అన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రసాద్ భార్య అంజినమ్మను ఎంపిటిసిగా ఎన్నికల్లో నిలబట్టుకుని, టిడిపి నాయకులు డబ్బులు ఖర్చు చేసి ప్రచారం చేసి ప్రజల మద్దతుతో గెలిపించుకున్నామని తెలిపారు. చాలా నష్టపోయానంటూ అంజినమ్మ భర్త ఇన్‌ఛార్జి మంత్రికి ఫిర్యాదు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కుటుంబంలో సభ్యులందరికీ ఎలాగైతే సమానంగా వ్యవహరిస్తామో పార్టీలో కూడా అదే తరహాలోనే అందరికీ ఎమ్మెల్యే సముచిత స్థానం కల్పిస్తున్నారన్నారు. ఒకరికి ఫీల్డ్ అసిస్టెంట్, మరొకరికి స్టోర్ డీలర్ వంటికి ఇస్తూ న్యాయం చేస్తున్నారన్నారు. అడిగనవన్నీ ఇవ్వాలంటే ఎవరికీ సాధ్యం కాదన్నారు. మరోసారి అవకాశం వచ్చినప్పుడు ఇప్పుడు రాని వారికి ప్రాధాన్యత ఇస్తారన్నారు. కొంత మంది ఉద్దేశపూర్వకంగా తప్పుడు ఆరోపణలు, బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తున్నారన్నారు. అధిష్టానం ఆదేశాల మేరకు ఎమ్మెల్యే అందరినీ కలుపుకుని పోతున్నారన్నారు. ద్విసభ్య కమిటీ, త్రిసభ్య కమిటీలు ఎన్ని ఉన్నా పార్టీ హైకమాండ్ ఆదేశాలు పాటించాల్సిందే అన్నారు. కావున సమిష్టిగా పని చేసి నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేద్దామని కలిసి రావాలి తప్ప ఆరోపణలు చేయడం సరికాదన్నారు. కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

భూసార పరీక్షలపై శిక్షణ

అనంతపురం : ప్రాజెక్టు వర్క్‌లో భాగంగా స్థానిక ఎస్‌కెయులో ఎంఎస్‌సి ఆర్గానిక్ కెమిస్ట్రీ చదువుతున్న విద్యార్థులకు భూసార పరీక్షలపై శనివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మట్టి నమూనాలు సేకరించే విధానం, భూసార పరీక్షలు ఉపయోగాలపై భూసార పరీక్ష కేంద్రం సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్‌ఆర్ పుష్పలత వివరించారు. ఈ కార్యక్రమంలో భూసార పరీక్ష కేంద్రం వ్యవసాయ అధికారులు పి.శ్రీనాథ్‌రెడ్డి, బిఆర్ శేఖర్‌రెడ్డి, బి.ఉమామహేశ్వరి, ఎస్.ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.


భూసార పరీక్షలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

'ఎలక్ట్రానిక్ వ్యర్థాల'పై అవగాహన

అనంతపురం : వికసిత్ భారత్ కార్యక్రమంలో భాగంగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పిజి కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో శనివారం 'ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, వాటిని సరైన పద్ధతిలో ఎలా విసర్జన చేయాలి' అనే అంశంపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగిన పద్ధతిలో వేరుచేయకుండా కలిగే దుష్ప్రభావాలు.. ఆరోగ్యం, వాతావరణంపైన ఎలా ప్రభావితం చేస్తాయనే విషయాలను ఎస్‌కెయు ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ డి.మురళీధరరావు, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.సోమశేఖర్ వివరించారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కెయు కామ్స్ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్-1 ప్రోగ్రాం ఆఫీసర్ సత్యనారాయణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం


మొమెంటోలు, సర్టిఫికెట్లతో విద్యార్థులు

అనంతపురం : నగరంలోని ప్రభాకర్ జి నగరపాలక ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.ఉమాదేవి ఆధ్వర్యంలో వార్షికోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.1,116తోపాటు మొమెంటోలు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో కత్తి విజయ్‌కుమార్, రషీద్‌బాషా, శ్రీ కళాపీఠం సంస్థ డైరెక్టర్ ఎన్.శంకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ భూములకు వేలం

పామిడి : పామిడి మండలం వంకరాజుకాలువ గ్రామంలో ఉన్న ఆంజనేయ, చెన్నకేశవ, భైరవస్వామి ఆలయానికి సంబంధించిన భూములను గుత్తి ఇఒ నాగేంద్రుడు ఆధ్వర్యంలో శనివారం బహిరంగ వేలంపాట నిర్వహించినట్లు ఆలయ ఇఒ కృష్ణయ్య తెలిపారు. ఆలయానికి సంబంధించి 45.06 ఎకరాలకు వేలం వేయగా రూ. 1,26,200 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ ధర్మాదాయ శాఖ సిబ్బంది, వంకరాజు కాలువ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీపై విచారణ

ఉరవకొండ : విడపనకల్లు మండల పరిధిలోని కొట్టాలపల్లి గ్రామానికి చెందిన రైతు జి.శ్రీరాములు సమర్పించిన గ్రీవెన్స్ అర్జీ (జింకల వల్ల పంట నష్టం)పై మండల వ్యవసాయ అధికారి పెన్నయ్య ఆధ్వర్యంలో శనివారం రైతుల సమక్షంలో విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులు ప్రతి సంవత్సరం జింకల వల్ల తమ పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లుతోందని తెలిపారు. జింకల బెడద నుంచి శాశ్వత పరిష్కారంగా అటవీశాఖ ద్వారా తగిన చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. అంతేకాకుండా జింకల వల్ల నష్టపోయిన పంటలకు నష్ట పరిహారం కూడా ప్రభుత్వం నుంచి అందేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. సమస్య పరిష్కారానికి జిల్లా అటవీశాఖ అధికారులకు నివేదికలు అందజేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు రంగనాయకులు, రవి, శ్రీరాములు, ఎఇఒ రాఘవేంద్ర, ఎంపిఇఒ శివలత, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పత్తిపాటి సంజీవరాయుడుకు నివాళి

నార్పల : మండల పరిధిలోని గంగనపల్లి గ్రామనికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు పత్తిపాటి సంజీవరాయుడు మృతికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు నివాళులర్పించారు. ఈమేరకు శనివారం గంగనపల్లి గ్రామానికి వెళ్లి సంజీవరాయుడు భౌతికకాయానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పిట్టు రంగారెడ్డి, గంగనపల్లి రాము, ఎర్రినాగప్ప, జాఫర్, తలారి కుళ్లాయప్ప, వెంకటనారాయణరెడ్డి, వెంకటరమణ, నాగభూషణ, రాజన్న, శ్రీనివాస్‌రెడ్డి, శంకర్, నాగర్జున, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

వికలాంగ భవన్ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న వికలాంగులు

శింగనమల : మండల కేంద్రంలో వికలాంగుల మండల సమైక్య భవనం ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని వికలాంగుల మండల అధ్యక్షుడు తరిమెల చాకలి నారాయణ కోరారు. శనివారం జిల్లాకేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీకి వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం అందించిన వారిలో ఆదినారాయణ, ఉల్లికల్లు బాలిరెడ్డి, సుబ్బమ్మ, కుల్లయమ్మ, మట్లగుంది మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలపై అవగాహన

రాయదుర్గం : మాదకద్రవ్యాల వినియోగంపై పట్టణంలోని రాయల్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు శనివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొరాళు శిల్ప మాట్లాడుతూ విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వార్డు సభ్యులు గౌని లావణ్య, పొరాళు గోవిందరాజులు, కోఆప్షన్ సభ్యులు నజీర్, వైసిపి నాయకులు పొరాళుశివ, గౌని శ్రీరామరెడ్డి, బషీర్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజన పాఠాలు నేర్చుకోని చంద్రబాబు

అనంతపురం : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన పాఠాలను ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంకా నేర్చుకోలేకపోవడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. శనివారం జిల్లాకేంద్రంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, అధికార వికేంద్రీకరణ అవసరం లేకుండా చంద్రబాబు వ్యవహరించడం మంచిది కాదన్నారు. శ్రీకృష్ణ, శివరామకృష్ణన్ కమిటీ నివేదికలను కూటమి ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ప్రపంచంలో ఎక్కడా లేని ధరలతో చంద్రబాబు అమరావతి నిర్మాణాలు, అమరావతి నిర్మాణం కోసం అప్పులు చేస్తున్నారన్నారు. కేంద్రం నుంచి గ్రాంట్ ఎందుకు సాధించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాయలసీమ ఇరిగేషన్ ప్రాజెక్టులకు నిధులు విడుదల చేయడం లేదన్నారు. టిసిఎస్ పేరుతో 29 ఎకరాల భూమిని రూ.29కే ఇవ్వడంపై పలు అనుమానాలకు తావిస్తోందన్నారు.

నేరాలు ఘోరాలు

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

గుత్తి : పట్టణంలోని కర్నూలు రోడ్డులో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఓ వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని బండగేరికి చెందిన లీలావతి అనే వృద్ధురాలు ఈనెల 12న తన బంధువుతో కలిసి ద్విచక్ర వాహనంలో వెళ్తోంది. అయితే కర్నూలు రోడ్డులో ద్విచక్ర వాహనం నుంచి జారీ రోడ్డుపై పడటంతో తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ఆమె పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి తరలించారు. అనంతపురం సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం వేకువజామున మృతిచెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.